సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 7 । మే । 2023



రాజ్యాంగ ప్రాధాన్యత అంశాలపై అవగాహన

రాజ్యాంగ ప్రాధాన్యత అంశాలపై అవగాహన అవసరమని న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. -IIలో..



ఉత్సాహంగా... ఉల్లాసంగా

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేందుకు వేసవి సెలవుల్లో 'చదవటం మా కిష్టం' కార్యక్రమాన్ని విద్యాశాఖ రూపొందించింది. -IIలో..



పాఠశాలలు తెరిచిన రోజే విద్యా కానుక

పాఠశాలలు ప్రారంభం రోజే జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తామని డీఈఓ రాఘవరెడ్డి పేర్కొన్నారు. -IIలో..

పది ఫలితాల్లో ఫోర్

- రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ జిల్లా 4వ స్థానం
- గతేడాది కంటే రెండు స్థానాలు ముందుకు
- జిల్లావ్యాప్తంగా 27,097 మందికిగాను 21,524 మంది పాస్
- ఈ ఏడాది బాలికలదే పైచేయి
- జిల్లావ్యాప్తంగా 17,500 మందికి ప్రథమస్థానం
- ఏపీఆర్ఎస్‌లో అత్యధికంగా 98.73 శాతం ఉత్తీర్ణత

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి ఫలితాల్లో వైఎస్సార్ జిల్లా విద్యార్థులు 79.43 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రస్థాయిలో నాల్గవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. గతేడాది కంటే రెండు స్థానాలు ముందుకు వెళ్లి 6 నుంచి 4వ స్థానంలో నిలిచారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా విద్యాశాఖ అధికారులు చాలా గట్టిగా పది పరీక్షలను నిర్వహించారు.

- జిల్లావ్యాప్తంగా 146 పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన పది పరీక్షలకు 27,097 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాయగా ఇందులో 21,524 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రెసిడెన్సియల్ స్కూల్స్ 98.73 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలువగా, బీసీ వెల్ఫేర్‌లో 90.96 శాతం ఉత్తీర్ణత సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. కేజీబీవీలలో 78 శాతం ఉత్తీర్ణత సాధించి తృతీయస్థానంలో నిలిచారు.



- జిల్లావ్యాప్తంగా 27,097 మంది విద్యార్థులు పది పరీక్షలు రాశారు. ఇందులో 14,060 మంది బాలురు.. 13,037 మంది బాలికలు పరీక్ష రాశారు. ఇందులో బాలురు 10,892 మంది పాసై 77.47 శాతం ఉత్తీర్ణతను సాధించారు. బాలికలకు సంబంధించి 10,632 మంది పాసై 81.55 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది కూడా బాలురపైన బాలికలదే పై చేయిగా నిలిచింది.

- పది పరీక్షలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 17,500 మంది విద్యార్థులు ప్రథమస్థానంలో ఉత్తీర్ణత సాధించగా 2917 మంది ద్వితీయస్థానంలో, 1107 మంది తృతీయస్థానంలో నిలిచారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల వివరాలు...

జిల్లాలో పలు మేనేజ్‌మెంట్ స్కూల్స్ వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో మైలవరంలోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్సియల్ బాలికల పాఠశాల, వేంపల్లి ఏపీఆర్ఎస్ స్కూల్, కడపలోని ట్రైబల్ బాలికల పాఠశాల, కడప బ్లైండ్ స్కూల్, అట్లూరు కేజీబీవీ, సింహాద్రిపురం కేజీబీవీ, చక్రాయపేట కేజీబీవీ, కమలాపురం బీసీ వెల్ఫేర్ పాఠశాల, తొండూరు బీసీ వెల్ఫేర్ స్కూల్, బలపనూరు జిల్లా పరిషత్తు పాఠశాల, వీఎన్‌పల్లె జెడ్పీ హైస్కూల్, పాయసంపల్లి జెడ్పీ హైస్కూల్, ఉరుటూరు జెడ్పీ హైస్కూల్, జమ్మలమడుగు ఉర్దూ హైస్కూల్, అమృత్‌నగర్ ఉర్దూ జెడ్పీ హైస్కూల్‌లో వందశాతం ఉత్తీర్ణతను సాధించారు.

మేనేజ్‌మెంట్ వారిగా ఉత్తీర్ణత శాతం ఇలా...

మేనేజ్‌మెంట్	పరీక్షలు రాసినవారు	పాస్	ఫెయిల్	ఉత్తీర్ణతశాతం
ఎయిడెడ్	763	497	266	65.14
బీసీ వెల్ఫేర్	188	171	17	90.96
ప్రభుత్వ	670	433	237	64.63
కేజీబీవీ	591	461	130	78.0
మున్సిపాలిటీ	1743	1068	675	61.27
మోడల్‌స్కూల్స్	263	193	73	72.24
ఏపీఆర్ఎస్	157	155	02	98.73
సోసియల్ వెల్ఫేర్	833	649	184	77.91
ట్రైబల్ వెల్ఫేర్	102	77	25	75.49
జెడ్పీ	9498	6507	2951	68.80
ప్రైవేటు	12,329	11,316	1,013	91.78
మొత్తం	27097	21524	5573	79.43



సంవత్సరం	పరీక్షలు రాసిన విద్యార్థులు	పాసైన వారు	పాస్ శాతం	రాష్ట్రంలో స్థానం
2017-18	35,660	34,008	95.37	10
2018-19	36,536	33,943	92.90	11
2019-20	37,600	37,600	100	-
2020-21	37,955	37,955	100	-
2021-22	38,035	27,018	71.03	06
2022-23	27,097	21,524	79.43	04

సంతృప్తికర ఫలితాలు....



పది ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయి. రాష్ట్రంలో వైఎస్సార్ జిల్లా 4వ స్థానంలో నిలిచింది. గతేడాదికంటే రెండు స్థానాలు ముందుకు వచ్చాము. చాలా సంతోషంగా ఉంది. రాబోయే ఏడాది ఈ ఫలితాలను మరింత ముందుకు తెస్తాము. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోపాటు ప్రత్యేక తరగతులు, నిత్యం పరీక్షల నిర్వహణతోనే ఈ ఫలితాలను సాధించాం.
– ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

నిరంతర కృషి, పర్యవేక్షణతోనే..



పదవ తరగతికి సంబంధించి నిరంతరం కృషి పర్యవేక్షణతోనే ఈ ఫలితాలను సాధించగలిగాం. ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలతోపాటు విద్యార్థుల్లో అభ్యసనాలను మెరుగుపరచడంతోనే ఈ ఫలితాలను సాధించగలిగాం. రాష్ట్రంలో 4వ స్థానంలో నిలిచినందుకు సంతృప్తికరంగా ఉంది. పోతే పదిలో ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందనవసరం లేదు. వారి కోసం ప్రభుత్వం సప్లిమెంటరీ ద్వారా ఒక అవకాశాన్ని కల్పించింది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళికబద్ధంగా చదివి మంచి ఫలితాలను సాధించుకోవాలి. – మార్తాల వెంకట క్రిష్ణారెడ్డి, పాఠశాల విద్య ఆర్‌జేడీ

న్యూస్‌రీల్

నేటి నుంచి క్రికెట్ శిక్షణ

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో ఈనెల 7వ తేదీ ఆదివారం నుంచి క్రికెట్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్.ఖాజామైనుద్దీన్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆధార్‌కార్డు, జనన ధృవీకరణపత్రం, ఫొటోతో హాజరై తమపేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు ఇలియాస్ 8452952984, అన్వర్ 9618883665 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

25 నుంచి రాజకీయ శిక్షణ తరగతులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 25, 26 ,27 తేదీల్లో కడప నగరంలో ఏఐఎస్ఎఫ్ రాయలసీమ స్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు తెలిపారు. ఈ మేరకు కడప సీపీఐ కార్యాలయంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యార్థుల భవిష్యత్తు పోరాటాలకు ఉపయోగకరంగా ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అశోక్, శివశంకర్, అరుణ్ పాల్గొన్నారు.

డీఎస్పీల బదిలీ

కడప అర్బన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పనిచేస్తున్న డీఎస్పీలలో నలుగురు బదిలీ అయ్యారు. రాజంపేట డీఎస్పీగా పనిచేస్తున్న జి.శివభాస్కర్‌రెడ్డిని కుప్పం డీఎస్పీగా బదిలీ చేశారు. వెయిటింగ్‌లో వున్న ఎస్. రమాకాంత్ వైఎస్ఆర్ జిల్లా కడప దిశ డీఎస్పీగా నియమితులయ్యారు. ఇటీవల జమ్మలమడుగు నుంచి ఏసీబీ డీఎస్పీగా బదిలీ అయిన ఎన్.నాగరాజు తిరిగి పూర్వస్థానానికే వచ్చారు. జమ్మలమడుగు డీఎస్పీగా ఉన్న బి.ఉమామహేశ్వర్ రెడ్డిని గుంటూరు వెస్ట్ డీఎస్పీగా బదిలీ చేశారు.

పెంచలకోన జాతర ఆర్టీసీ ఆదాయం రూ.14 లక్షలు

కడప కోటిరెడ్డిసర్కిల్: నెల్లూరు జిల్లా పెంచలకోన జాతరకు ఏపీఎస్ ఆర్టీసీ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని బద్వేలు, రాజంపేట డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపామని, వాటి ద్వారా రూ. 14,34,519 ఆదాయం ఒనగూరిందని కడపజోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్‌రెడ్డి తెలిపారు. ఈనెల 3 నుంచి 5వ తేది వరకు ఈ బస్సులను నడిపామన్నారు. బద్వేలు డిపో నుంచి 12 బస్సులు 82 ట్రిప్పులు నడపగా రూ. 5,59,570 ఆదాయం వచ్చింది. అలాగే రాజంపేట డిపో నుంచి 20 బస్సులు 133 ట్రిప్పుల ద్వారా రూ. 8,74,949 ఆదాయం ఒనగూరిందన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని పొలతల, నిత్య పూజకోనలకు ప్రతి సోమవారం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు డిపో నుంచి ప్రతి సోమవారం ఉదయం 6 గంటలకు పొలతలకు బస్సును ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సు ప్రొద్దుటూరు, కడప మీదుగా పొలతలకు వెళుతుందన్నారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు పొలతలలో బయలుదేరి రాత్రి 7 గంటలకు జమ్మలమడుగుకు చేరుతుందన్నారు. అలాగే ప్రొద్దుటూరు డిపో నుంచి మరో బస్సు ఉదయం 6.30 గంటలకు బయలుదేరి మైదుకూరు, కడప, భాకరాపేట మీదుగా ఉదయం 10.00 గంటలకు నిత్యపూజకోనకు చేరుతుందన్నారు. తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు ఇదేమార్గంలో ప్రొద్దుటూరుకు సాయంత్రం 7 గంటలకు చేరుతుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

12న వేలాంగిణికి..

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి ఈనెల 12వ తేదీన వేలాంగిణికి సూపర్ లగ్జరీ బస్సులు నడపనున్నామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రమైన కడప డిపో నుంచి రాత్రి 8.00 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. ఒక్కొక్కరికి రానుపోను రూ.2200 చార్జీగా ఉంటుందన్నారు. అలాగే మైదుకూరు డిపో నుంచి సాయంత్రం 7.00గంటలకు బయలు దేరుతుందన్నారు. చార్జి రూ.2200గా ఉందన్నారు. జమ్మలమడుగు డిపో నుంచి సాయంత్రం 4.00 గంటలకు బయలుదేరే సర్వీసులో చార్జి రూ.2600గా నిర్ణయించారన్నారు. బద్వేలు డిపో నుంచి సాయంత్రం 7 గంటలకు బయలుదేరే బస్సులో చార్జి రూ. 2400గా ఉంటుందన్నారు. ఈ బస్సులు తిరుపతి, తిరుత్తణి, కంచి, నాగపట్నం మీదుగా మరుసటిరోజు ఉదయం వేలాంగిణికి చేరుతుందన్నారు. తిరిగి ఆదివారం ఉదయం 11 గంటలకు వేలాంగిణి నుంచి ఈ బస్సులు బయలుదేరి ఇదే మార్గంలో ఆయా ప్రాంతాలకు చేరుతాయన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే కేసులు

కలెక్టర్ వి.విజయ్ రామరాజు



కడప సెవెన్‌రోడ్స్ : లింగ నిష్పత్తిలో అసమానతలను తొలగించి సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు అందరూ కృషి చేయాలని, లింగ వివక్ష చూపే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని తన చాంబర్లో పీసీ పీఎన్డీటీ (గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నిర్మూలన), డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ (డీఎల్ ఎంఎంఏఏ) జిల్లా స్థాయి కమిటీ పై వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్, విద్యాశాఖ పోలీస్ అధికారులతో కలెక్టర్ వి.విజయ్ రామరాజు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిష్పత్తిలో అసమానతను తొలగించి సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచాలన్నారు. గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు నిర్వహించేవారిపై చట్టపరమైన శిక్షలు అమలు చేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో డెలివరీ అయిన పిల్లల బర్త్ సర్టిఫికెట్ వారి తల్లిదండ్రులకు త్వరగా అందించేలా చూడాలన్నారు. జిల్లాలో ఆరోగ్యకరమైన లింగ నిష్పత్తిని తీసుకురావాలన్నారు. జిల్లాలో జరుగుతున్న అబార్షన్లపై ఎప్పటికప్పుడు వైద్యాధికారులు సమాచారాన్ని సేకరించాలన్నారు. బాల్య వివాహాలపై నిఘా ఉంచాలన్నారు. ఇందుకోసం మహిళా పోలీసు, అంగన్వాడీ కార్యకర్తలు ఏఎన్ఎం సమన్వయంతో పని చేయాలన్నారు. పీసీ పీఎన్డీటీ యాక్ట్ పై విద్యాశాఖ విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు ఇందులో భాగస్వామ్యులై పనిచేయాలని ఆయన వారికి సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, అడిషనల్ డీఎంహెచ్ఓ ఉమామహేశ్వర్, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, డీఎస్పీ షరీఫ్, డీఈఓ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరును కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతాం

- పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- ప్రొద్దుటూరులో అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి సురేష్, ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాచమల్లు, రఘురామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి



డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, చిత్రంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు క్రైం : మున్సిపల్ కార్పొరేషన్‌గా చేయడానికి ప్రొద్దుటూరుకు అన్ని అర్హతలు, అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. కార్పొరేషన్ చేయడానికి ప్రభుత్వ పరిశీలనలో పెడతానని మంత్రి హామీ ఇచ్చారు. ప్రొద్దుటూరులో పలు అభివృద్ధి కార్యక్రమాలను శనివారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి ప్రారంభించారు. నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం గాంధీ మున్సిపల్ పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని పట్టించుకోలేదన్నారు. నాలుగేళ్లలోనే స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు నాయకత్వంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం, మార్కెట్, విద్యాసంస్థల అభివృద్ధి, రోడ్ల విస్తరణ తదితర వాటి కోసం ఎమ్మెల్యే రాచమల్లు ... సీఎం వైఎస్ జగన్ వద్దకు వెళ్లి రూ. 520 కోట్ల నిధులను మంజూరు చేయించుకొని వచ్చారన్నారు. ప్రొద్దుటూరు ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ. 120 కోట్లతో అమృత్ పథకం కింద మంచినీటిని తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే రాచమల్లుదని తెలిపారు. రూ.160 కోట్లతో డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారన్నారు. రూ. 50 కోట్లతో కూరగాయల మార్కెట్‌ను నిర్మిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఇంత పెద్ద మార్కెట్ లేదన్నారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ సహాయ సహకారాలతో, మున్సిపల్ సొంత నిధులతో పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే సొంత, వ్యక్తిగత నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్రంలో ఇంతగా సొంత నిధులను వెచ్చిస్తున్న ఎమ్మెల్యేను ఎక్కడా చూడలేదన్నారు. ఇంత చేస్తున్నా ఆయనపై ఆరోపణలు చేయడం చాలా బాధేస్తుందన్నారు.

ఓటు అడిగే అర్హత టీడీపీకి లేదు: ఎమ్మెల్యే

ప్రజలను ఓటు అడిగే అర్హత టీడీపీకి లేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని 54 వేల మంది డ్వాక్రా మహిళలకు సంబంధించిన రూ. 160 కోట్ల రూపాయలను ప్రభుత్వం తీర్చిందన్నారు. పట్టణంలో 24 వేల మందికి ఇంటి పట్టాలను ఇచ్చామన్నారు. మూడు కాలనీల్లో మౌలిక వసతులతో పాటు ఇళ్ల నిర్మాణానికి రూ. 1000-1200 కోట్లు చేశామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్లను ఇచ్చి ఉంటే ఇన్ని వేల ఇళ్లు ఎందుకు ఇవ్వాల్సి వస్తుందని ప్రశ్నించారు. 70 ఏళ్ల నాటి పైపులైన్‌ను రూ. 160 కోట్లతో మారుస్తున్నామన్నారు. ప్రధాన డ్రైనేజీ కాల్వలను ఆధునీకరిస్తున్నామని, కూరగాయల మార్కెట్ స్థానంలో రూ. 53 కోట్లతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అధునాతనంగా నిర్మిస్తున్నామన్నారు. బస్టాండు, రామేశ్వరం బ్రిడ్జి, వైఎస్సార్ ఇంజినీరింగ్‌కాలేజీ, ఎస్సీఎస్ఆర్ కాలేజీ, రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఇంకా అనేక అభివృద్ధి పనులను చేస్తున్నామన్నారు. ప్రజల ఆశీస్సులతో 2024లో మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి, ఎంపీ సహకారంతో ప్రొద్దుటూరులో అన్ని అభివృద్ధి పనులను చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అన్నమయ్య జయంత్యుత్సవాలు

- తాళ్లపాకలో కమనీయంగా శ్రీవారికల్యాణం

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 615 జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో తొలి రోజున తాళ్లపాకలో శనివారం శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లను వేదపండితులు కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం 1 గంట వరకు అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. పుణ్యాహవచనం, పవిత్రహోమం, కంకణధారణ, మాంగళ్యధారణ, మంగళాశాసనం ఘట్టాలతో శ్రీవారి కల్యాణం జరిగింది. చివరగా నక్షత్రహారతి, మంగళహారతి కార్యక్రమాలతో కల్యాణం ముగిసింది. భక్తులకు టీటీడీ మంచినీరు ,మజ్జిగ, ప్రసాదాలను అందించింది. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు. కాగా కల్యాణంలో జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, సర్పంచి గౌరీశంకర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మర్రి రవి, నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచి జంబు సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షుడు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, మాజీ సర్పంచి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి కల్యాణంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

అలరించిన సంకీర్తనాగోష్ఠిగానం

అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు నిర్వహించిన సంకీర్తనా గోష్ఠిగానం భక్తులను అలరించింది. చెన్నైకు చెందిన సరిగమ మ్యూజిక్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు సంగీతసభ, తిరుపతికి చెందిన రమ్యకృష్ణ బృందం హరికథగానం చేశారు. కాగా అన్నమయ్య వారసులు హరిస్వామితోపాటు మరో ఇద్దరిని టీటీడీ ఘనంగా సత్కరించింది. టీటీడీ అధికారిణి హేమలత, టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్తు ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్‌సేవ: కడప-రేణిగుంట నేషనల్‌హైవేలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద శనివారం సాయంత్రం శ్రీవారి ఊంజల్‌సేవ వైభవంగా జరిగింది. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ప్రసాద్, రేవతిబృందం అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. తిరుపతికి చెందిన నాగమణి బృందం హరికథ కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు నీట్ అర్హత పరీక్ష

కడప ఎడ్యుకేషన్: ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయూష్ వైద్య విద్యలో ప్రవేశానికి జాతీయస్థాయిలో ఆదివారం నిర్వహిస్తున్న నీట్ అర్హత పరీక్షకు జిల్లాపాలనా యంత్రాంగం ఏర్పాటు చేసినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కోఆర్డినేటర్ హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ ప్రవేశ పరీక్షకు జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాలుగు పరీక్షా కేంద్రాలలో 2185 మంది ఈ పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. ఇందులో కడపలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, యస్‌వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, అన్నమాచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సు కళాశాలతోపాటు ఖాజీపేట మండలంలో భీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్స్‌ను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీట్ పరీక్షకు ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతిస్తామన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 వరకు కొనసాగుతుందని తెలిపారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

- వేసవి సెలవుల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం
- ఈ నెల 1 నుంచి జూన్ 10 వరకు నిర్వహణ
- విద్యార్థుల్లో పఠనా సామర్థ్యం పెంచడమే లక్ష్యం


తరగతి గదిలో తోటి విద్యార్థులకు కథ చెబుతున్న విద్యార్థి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడం ద్వారా నిష్ణాతులైన చదువరిగా తయారు చేయాలనే లక్ష్యంతో వేసవి సెలవుల్లో 'చదవటం మా కిష్టం' కార్యక్రమాన్ని విద్యాశాఖ రూపొందించింది. మే 1వ తేదీ నుంచి జూన్ 10 వరకు 41 రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమానికి సంబంధించి విద్యార్థులు ఏం చేయాలి, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఏం చేయాలన్న విధి విధానాలపై పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పాఠశాల లైబ్రరీ పుస్తకాలు అందించి వారు ఆ పుస్తకాలు చదివేలా ప్రోత్సహించడంతోపాటు వివిధ కేటగిరిల్లో పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 2065 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 1,58,000 మంది విద్యార్థులు చదువుతున్నారు.

కార్యాచరణ ఇలా...
చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు వారి పరిధిలోని ప్రధానోపాధ్యాయులు సమావేశం నిర్వహించి కార్యక్రమ ఉద్దేశాలను వివరిస్తారు. కార్యక్రమం విజయవంతం అయ్యేలా ఎంఈఓలు చర్యలు తీసుకోవాలి. ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో చర్చించి యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలి. పాఠశాలలోని విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని తమకు కేటాయించిన విద్యార్థులతో వాట్సాప్ గ్రూపును క్రియేట్ చేస్తారు. పాఠశాలలోని గ్రంథాలయంలో పుస్తకాలను తరగతుల వారిగా విభజించి ఒక్కో విద్యార్థికి వారి పఠనా సామర్థ్యం ఆధారంగా ఐదు నుంచి పది పుస్తకాలు అందిస్తారు. తల్లిదండ్రులకు వినిపించేలా విద్యార్థులు బిగ్గరగా కథలను చదివేలా ప్రోత్సహిస్తారు. లీడ్ టీచర్ ప్రతి రోజు వాట్సాప్ గ్రూపులో ఒక కథ పోస్టు చేసి విద్యార్థులతో చదివిస్తారు. ఆ తర్వాత విద్యార్థులు వారి అభిప్రాయాలను గ్రూపులో పంచుకునేలా చూస్తారు. ఆసక్తి ఉన్న విద్యార్థులను తాము సొంతంగా రాసిన కథలు కూడా గ్రూపుల్లో పోస్టు చేయాలని చెప్పాలి.

విద్యార్థులు ఏం చేయాలి:
- కథ చదివిన తరువాత ప్రతి విద్యార్థి ఆ పుస్తకంపై తన అభిప్రాయాన్ని రాత పుస్తకంలో రాసుకోవాలి.
- కథలో పాత్రలు, సన్నివేశాలు, బొమ్మలపై తమ భావాలను వాట్సాప్ గ్రూపుల్లో ఇతరులతో పంచుకోవాలి.
- విద్యార్థులు తమ బంధువుల ఇళ్లకు వెళ్తే, అక్కడి పుస్తకాల వివరాలు సేకరించి తనతో పాటు తీసుకెళ్లిన రాత పుస్తకంలో రాసుకోవాలి.
- పాత వార్త పత్రికలు, మ్యాగ్‌జైన్లు సేకరించి అందులో ఒకే రకమైన ఆసక్తి ఉన్న చిత్రాలను కత్తిరించి పుస్తకంలో అతికించాలి.
- వాట్సాప్ గ్రూపులోని విద్యార్థులు చదివిన కథలను పరస్పరం చెప్పుకోవాలి.
- పాత వార్తపత్రికలు, ఆదివారం అనుబంధం పుస్తకాల్లోంచి కథలు సేకరించి వాటిని రాత పుస్తకాల్లో రాసుకోవాలి.
- ఇలా రాసుకున్న వాటి ఆధారంగా సొంతంగా కథలు రాయాలి.

విద్యార్థులకు పోటీలు
విద్యార్థులు నేర్చుకున్న అంశాలను మూడు స్థాయిలుగా విభజించారు.
స్థాయి 1 : 3 నుంచి 5వ తరగతి వరకు పోటీలకు అర్హులు. వీరు ఏదైనా ఒక కథనాన్ని ఎంచుకుని చదివి రికార్డ్ చేసి దానిని విద్యాశాఖ ఇచ్చిన మెయిల్‌కు పంపాలి.
స్థాయి 2 : 6 నుంచి 8వ తరగతి వరకు పాల్గొనవచ్చు. వీరు కూడా ఏదైనా ఒక కథ సొంతంగా రాసి దానిపై స్కాన్ చేసి సంబంధిత మెయిల్‌కు పంపాలి.
స్థాయి 3 : ఇందులో 9 నుంచి 12 తరగతి వరకు, డైట్ కళాశాల విద్యార్థులు పాల్గొనవచ్చు. వీరు చదివిన పుస్తకంపై సమీక్ష లేదా సొంత కథను రాసి సంబంధిత మెయిల్‌కు పంపాలి.

సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలి
చదవడం మాకిష్టం అనే కార్యక్రమం మే 1 నుంచి జూన్ 10 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు జరగాలి. ఈ విషయమై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలతో ప్రధానోపాధ్యాయులు ఒక డాక్యుమెంటేషన్ తయారు చేసి సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలి. – అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి

పుస్తకాలు చదవడం అలవాటు చేసేందుకు..
పిల్లలు సెలవుల్లో ఖాళీగా లేకుండా పుస్తకాలు చదవడం ఒక అలవాటు చేయాలన్నదే కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. విద్యార్థులను గ్రూపుల వారిగా విభజించి లైబ్రరీలోని పుస్తకాలను ఇస్తాం, వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసి వారు చదివిన వాటిని ఆడియో, పిక్చర్స్‌ను మెయిల్ చేయడం జరుగుతుంది. విద్యార్థుల్లో సృజనాత్మకత, వైఖర్లు, భాషపై పట్టు అభివృద్ధి చెందుతాయి. ఉత్తమ ఫలితాలు వస్తాయి. – వై. రాఘవరెడ్డి, డీఈఓ, వైఎస్సార్ జిల్లా

కోవిడ్ నిధులు కొట్టేసిన ఉద్యోగి సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

కడప రూరల్ : 'కోవిడ్ నిధులను కొట్టేశారు' అనే కథనం శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైంది. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్పందించింది. ఈ అక్రమాలకు పాల్పడిన జూనియర్ అసిస్టెంట్ మనోజ్‌కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. కోవిడ్ నిధులను తన ఖాతాలో వేసుకున్న రూ. 8 లక్షలను రికవరీ చేశారు. అతని బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. కాగా ఆ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగి అమ్మ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోనే పని చేస్తూ ఏడు నెలల క్రితం మరణించారు. కారుణ్య నియామకం కింద ఆమె కుమారుడికి ఉద్యోగం లభించింది. అతను ఒక నకిలీ సీఎఫ్ఎమ్ఎస్ ఐడీని క్రియేట్ చేసి రూ.8 లక్షల కోవిడ్ నిధులను దారి మళ్లించినట్లు సమాచారం. ఎవరి ప్రమేయం లేకుండా అక్రమాలకు పాల్పడడం ఆశ్చర్యం. దీని వెనుక ఎవరి హస్తమైనా ఉందా..? అనే సందేహాలు ఆ శాఖ ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. ఈ అంశంపై సమగ్ర విచారణ చేపట్టినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు.

బైక్‌పై నుంచి జారి పడి..


మృతి చెందిన చెన్నమ్మ

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో బైక్ పై నుంచి జారి పడి ఓ మహిళ మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం వల్లూరు మండలం వెంకటాపురం వీవర్స్ కాలనీకి చెందిన మునగపాటి చెన్నమ్మ (46) కమలాపురంలోని స్టేట్‌లో పని నిమిత్తం తన అల్లుని ద్విచక్ర వాహనంలో కమలాపురానికి బయలు దేరింది. పాపాఘ్ని నది దాటిన తర్వాత బైక్ పై నుంచి అదుపుతప్పి ఆమె జారి కింద పడింది. వెనుకనే వస్తున్న గుర్తు తెలియని వాహనం ఆమె పై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ చిన్నపెద్దయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కాగా మృతురాలికి ఇద్దరు వివాహిత కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండు రోజుల క్రితమే కుమారుడి వివాహం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతం అయ్యారు. కాగా ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు.

ముత్యపు పందిరి వాహనంపై నారాపురస్వామి


ముత్యపు పందిరి వాహనంపై దేవదేవుడు

జమ్మలమడుగు : జమ్మలమడుగులో నారాపుర స్వామి ముత్యపు పందిరి వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. బ్రహ్మోత్సవాలలో 4వ రోజు అయిన శనివారం వెంకటేశ్వరస్వామికి ముత్యపు పందిరి వాహనంపై పురవీధుల మీదుగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. తమ ఇళ్ల ముందు నుంచి స్వామి వారు వెళ్తుండటంతో భక్తులు పూజ చేసి, నైవేద్యాలను సమర్పించారు. మరికొంత మంది స్వామి వారికి నిండు బిందె నీరు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం సింహ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు.

వెల్లాలలో నేడు రథోత్సవం

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రథోత్సవం (తిరునాల) కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి శ్రీ చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాములను దర్శించుకోనున్నారు. 11 గంటల సమయంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, హోమాలు చేసిన తర్వాత రథంలో ఆశీనులను చేసి గ్రామంలోని వీధుల్లో ఊరేగించనున్నారు. ప్రస్తుతం వెల్లాల గ్రామం భక్తులతో, కొత్త కొత్త దుకాణాలతో కళకళలాడుతోంది. స్వామి వారిని క్యూలో దర్శించుకోవడానికి ఆలయం వెలుపల శనివారం భారీకేడ్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని ఆలయ చైర్మన్ విజయలక్ష్మి, ఈఓ నరసయ్య చెప్పారు.

నేడు బండలాగుడు పోటీలు
వెల్లాల గ్రామంలో ఆదివారం రాష్ట్రస్థాయి సీనియర్ వృషభరాజములకు బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి తెలిపారు. ఇందులో గెలుపొందిన ఎడ్లకు మొదటి, రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ, ఆరవ బహుమతులుగా రూ.1,10,000, రూ.75,000, రూ.50,000, రూ.30,000, రూ.20,000, రూ.10,000, మిగిలిన ఎడ్లకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని వారు చెప్పారు.

రేపు ఒంటెద్దు బండలాగుడు పోటీలు
అలాగే సోమవారం ఉదయం ఒంటెద్దు బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి తెలిపారు. అందులో గెలుపొందిన ఎద్దు యజమానికి మొదటి, రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ, ఆరవ బహుమతులుగా రూ.15,000, రూ.10,000, రూ.7000 రూ.4000, రూ.2500, రూ.2000లు అందిస్తామన్నారు.

రాజ్యాంగంపై అవగాహన


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి

కడప అర్బన్ : రాజ్యాంగ ప్రాధాన్యత అంశాలు, న్యాయ అవగాహన ఎంతో అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. శనివారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణం న్యాయసేవాసదన్‌లో రాజ్యాంగ ప్రాధాన్యత అంశాలపై అవగాహన సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని సవరణలు ఏవైనా సరే ముఖ్యమైన, ప్రాథమిక నిర్మాణాలకు భంగం కలిగించరాదన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి అపరాధం కలుగరాదన్నారు. కేశవానంద భారతి వర్సెస్ కేరళ రాష్ట్రం కేసుకు సంబంధించి భారత సుప్రీంకోర్టు రాజ్యాంగంపై తీర్పునిచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సీ.ఎస్ మూర్తి, నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గీత, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ ఎం.ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత, జూనియర్ సివిల్ జడ్జి ప్రసూన, భార్గవి, కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచిన రోజే విద్యా కానుక


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జూన్ 12వ తేదీన పాఠశాలలు ప్రారంభం రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్న విద్యాకానుక పంపిణీపై సోమవారం కడప కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఎంఈఓలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, సీఆర్‌పీలు, మండల స్టోరేజ్ పాయింట్ల ప్రధానోపాధ్యాయులకు సీఎంఓ మిట్టా కేశవరెడ్డి అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక కోసం ప్రత్యేకంగా జిల్లా, మండల, పాఠశాల స్థాయిలలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి పాఠశాలల ప్రారంభం నాటికే ప్రతి విద్యార్థికి కిట్టు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండల కేంద్రాలకు చేరిన విద్యాకానుక వస్తువులన్నింటినీ ఒక కిట్టుగా ఏర్పాటు చేసి పిల్లలకు ఒకేసారి అందించడం జరుగుతుందన్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ సారి అన్నింటినీ ఒకేసారి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. మండల కేంద్రాలకు చేరుతున్న విద్యాకానుక వస్తువులను ఏ విధంగా స్వీకరించాలి, ఎలా భద్రపరచుకోవాలి, జేవీకే యాప్‌లో ఏవిధంగా నమోదు చేయాలనే అంశాలను పీపీటీ ద్వారా వివరించారు. ప్రతి మండలానికి రెండు లాగిన్లు ఇచ్చి విద్యాకానుక నమోదు పర్యవేక్షించాలని ఎంఈఓలకు సూచించారు. జిల్లా కేంద్రంలో విద్యాకానుక పంపిణీలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు ధనలక్ష్మి, దశరథరామిరెడ్డి, లక్ష్మీనరసింహారాజు, రామాంజనేయరెడ్డి, రమణమూర్తి, ఇలియాస్‌ఖాన్, ఏఐఎస్ బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా నరసింహుని కల్యాణం


కల్యాణం తిలకిస్తున్న భక్తులు


స్వామి, అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

పెండ్లిమర్రి : మండలంలోని వెయ్యినూతల కోనలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవారి కల్యాణోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కనులారా తిలకించారు. ముందుగా భక్తులు కోనేర్లలో స్నానాలు ఆచరించి స్వామివారికి మొక్కులు చెల్లించి కల్యాణంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం గజవాహన సేవ, సాయంత్రం ధ్వజ అవరోహణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి వారిని కోనేటి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి చక్రస్నానం చేశారు. ఉత్సవాలు నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగాయి. ఆలయ ఆవరణలో భక్తులకు పలువురు దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్, వేదపండితులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు, మాట్లాడుతున్న న్యాయమూర్తి సీఎస్ మూర్తి

కడప అర్బన్ : జాతీయ న్యాయసేవాధికార సంస్థ, ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా జిల్లాలో న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13న జిల్లా వ్యాప్తంగా జాతీయలోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈక్రమంలో శనివారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సీఎస్ మూర్తి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్, అన్నమయ్య జిల్లా రాయచోటి అదనపు ఎస్పీ డాక్టర్ వి.రాజ్‌కమల్, జమ్మలమడుగు డీఎస్పీ ఎన్.నాగరాజు, ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.